క్లుప్తంగా

రతన్‌టాటాకు ఘన నివాళి



కైకలూరు: దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్‌టాటా మరణం తీరనిలోటని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కై కలూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పి.గౌతంరెడ్డితో కలసి రతన్‌టాటా చిత్రపటం వద్ద గురువారం నివాళులర్పించారు. రతన్‌టాటా సేవా గుణాన్ని కొనియాడారు. అనంతరం దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పించారు . కార్యక్రమంలో ఎంపీటీసీలు బాలమ్మ, కొండయ్య, బాలు, సర్పంచులు ఏసుబాబు, విజయబాబు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: వ్యాపార దిగ్గజం రతన్ టాటాకు హైవ్ యూత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గోత్రు నాగబాబు, గౌరవాధ్యక్షురాలు కొల్లిపర అనసూయ పార్థసారథి, సెక్రటరీ కళివరపు రంగారావు, సభ్యుడు విజయ్ ఘనంగా నివాళులర్పించారు.

పోస్టల్ సిబ్బందికి సత్కారం



పామర్రు: స్థానిక పోస్టాఫీస్ వద్ద గురువారం పద్మశ్రీ ఘంటసాల కళాపీఠం వారి ఆధ్వర్యంలో జాతీయ పోస్టల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోస్టల్ ఉద్యోగులను సత్కరించారు. కళాపీఠం అధ్యక్ష కార్యదర్శులు కాటూరి వెంకట మురళీకృష్ణ, నందిపాటి హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ పోస్టల్ ఉద్యోగుల సేవలను కొనియాడారు. అనంతరం పోస్టు మాస్టర్ కంతేటి శ్రీనివాసరావు, పోస్టల్ ఉద్యోగులు పువ్వుల శ్రీనివాసరావు, ఎం.నాగసతీష్, కెవీ శ్రీనివాసరావు, పి.త్రినేత్రి, ఎల్‌వీ కుమార్, జె.అలేఖ్యలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాపీఠం సభ్యులు సాల్మన్ కొల్లాబత్తుల పాల్గొన్నారు.

వైద్యసేవల పరిశీలన



గుడివాడటౌన్: ప్రభుత్వ ఆసుపత్రులకు పేదలు ఎక్కువగా వస్తుంటారని, వారికి మెరుగైన సేవలందించాల్సిన బాధ్యత వైద్యసిబ్బందిపై ఉందని 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం సూచించారు. రాష్ట్ర న్యాయసేవాధికారి ఉత్తర్వుల మేరకు మానసిక వికలాంగుల ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని గురువారం ఆయన సందర్శించారు. రోగులకు అందుతున్న వసతులు, సౌకర్యాలు, వైద్యుల పర్యవేక్షణ తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఇందిరాదేవి, ఆసుపత్రి వైద్యులు, ప్యానల్ న్యాయవాదులు పివి.రాజు, రఫీ, కుటుంబరావు, లక్ష్మీనారాయణ, సూర్య, శివాజీ పాల్గొన్నారు.

రూ.3.86లక్షలు జరిమానా

పామర్రు: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మచిలీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీబి శ్రీనివాస్ హెచ్చరించారు. విద్యుత్ విజిలెన్స్ అధికారులు గురువారం పామర్రు మండలంలోని వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాల్లోని విద్యుత్ మీటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వాసు ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ అధికారులు 41బృందాలుగా ఏర్పడి 2796 గృహసర్వీసులను, 63వాణిజ్య సముదాయాలను తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. 137 సర్వీసులకు అదనపు లోడు కింద రూ.3.86లక్షలను జరిమానాగా విధించినట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.సుందరరావు, అసిస్టెంట్ ఇంజనీర్ కె మోహనకృష్ణ, పామర్రు, మచిలీపట్నం డివిజన్ పరిధిలోని ఏడీఈలు,ఏఈలు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ ముగుస్తున్నా..అందని సాయం

- రైతులపై కనికరం చూపని సర్కారు
- నేటికీ అందని పెట్టుబడి సాయం
- జగనన్న పాలనలో ఠంఛనుగా సొమ్ము జమ
- నేడు ఆ ఊసేఎత్తని కూటమి ప్రభుత్వం



వరిపొలంలో మందు పిచికారి చేస్తున్న రైతు (ఫైల్)

కైకలూరు: ఖరీఫ్ సాగుకాలం ముగుస్తున్నా రైతులకు పెట్టుబడి సాయం మాత్రం నేటికీ అందలేదు. సూపర్‌సిక్స్ పథకాలో భాగంగా రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20వేలు అందిస్తామంటూ ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన టీడీపీ అధినేత చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఆఊసే ఎత్తడం లేదు. దీంతో పెట్టుబడుల కోసం రైతులు, కౌలురైతులు అధిక వడ్డీలకు అప్పులు చేయక తప్పని పరిస్థితి ఈ ఖరీఫ్‌లో చోటుచేసుకుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనహయాంలో వైఎస్సార్ రైతుభరోసా పథకం కింద ఏటా ఒక్కో రైతుకు రూ.13500 చొప్పున అందించగా, అంతకంటే అదనంగా మరో రూ.6500 కలిపి ఏటా రూ.20వేలు ఇస్తానన్న సీఎం చంద్రబాబు ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా కూడా నేటికీ రైతులకు పెట్టుబడిసాయం అందించకపోవడంపై రైతులు మండిపడుతున్నారు.

నాలుగు నెలలు పూర్తవుతున్నా..

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు పూర్తవుతున్నప్పటికీ అన్నదాత సుఖీభవ పథకం ఇంకా కార్యరూపం దాల్చలేదు. గత ఐదేళ్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పీఎం కిసాన్, వైఎస్సార్ రైతుభరోసా కింద మూడు విడతల్లో రైతుకు సాయాన్ని అందించింది. ఖరీఫ్ పంట వేసే ముందు మేలో రూ.7,500, అక్టోబరులో ఖరీఫ్ పంటకోత సమయంలోనూ ఇక రబీ అవసరాల కోసం రూ.4,000, ధాన్యం ఇంటికి చేరే సంక్రాంతి వేళ జనవరిలో రూ.2,000 అందించి రైతుసంక్షేమంపై తన చిత్తశుద్ధిని చాటిచెప్పింది. ఇక చంద్రబాబు ప్రభుత్వం మాత్రం రైతులకు పెట్టుబడి సాయం అందించే విషయంలో నాలుగు నెలలుగా మీనమేషాలు లెక్కిస్తోంది. అధికవడ్డీలకు అప్పులు తెచ్చి ఖరీఫ్ సాగు చేపడితే, ఇటీవల సంభవించిన వరదలు పంటలను ముంచెత్తి తమను కోలుకోలేని దెబ్బతీశాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

గతంలో రూ.55.84కోట్ల సాయం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కైకలూరు నియోజకవర్గంలోని 13,403మంది రైతులకు వైఎస్సార్ రైతుభరోసా పథకం కింద రూ.55,83,79,850లను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. కరోనా వచ్చినా, ఆర్థికంగా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఠంచనుగా రైతులకు పెట్టుబడి సాయం అందించింది. కాని ప్రస్తుత సీఎం చంద్రబాబు పాలన రైతులకు ఆ భరోసా లభించలేదు. ఇకనైనా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం స్పందించి అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయంగా అందిస్తామన్న రూ.20వేలను త్వరితగతిన అందజేయాలని రైతులు కోరుతున్నారు.

ఎదురు చూస్తున్నాం..



అధికారంలోకి వచ్చిన వెంటనే పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20వేలు అందిస్తామని టీడీపీ కూటమి నాయకులు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు పెట్టుబడి సాయం అందలేదు.

–సీహెచ్.రామారావు, లింగాల

రైతులకు చేయూత ఏదీ?..



కష్టాలతో కాలం గడిపే రైతులను ఆదుకోవాలి. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద పెట్టుబడిసాయంగా రూ.13500 ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు ప్రస్తుత ప్రభుత్వం రూ.20వేలు ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

–నల్లమోతు వేణుగోపాలరావు, మండవల్లి

హామీ నెరవేర్చాలి..



పెట్టుబడి సాయం కోసం రైతులం వేయికళ్లతో ఎదురు చూస్తున్నాం. ఖరీఫ్ ముగుస్తున్నా ఆఊసే లేదు. రైతులను ఆదుకునేందుకు పెట్టుబడిసాయం అందిస్తామన్న సీఎం చంద్రబాబు తన హామీని నెరవేర్చాలి.

–ఎం.రాంబాబు, లింగాల

అధిక వడ్డీలకు అప్పులు చేశాం..



ఖరీఫ్ సాగు చివరిదశకు చేరుకున్నప్పటికీ పెట్టుబడి సాయం మాత్రం మాకు నేటికీ అందలేదు. పెట్టుబడుల కోసం అధికవడ్డీలకు అప్పులు చేశాం. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు అందించి మమ్మల్ని ఆదుకోవాలి.

–పంది్శ సూర్యనారాయణ, మండవల్లి

దివ్యాంగులను ఆదరించాలి

జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి




కైకలూరు: సమాజంలో మానసిక వికలాంగులను అందరూ ప్రేమతో ఆదరించాలని కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శీతనపల్లి పీహెచ్‌సీలో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముందుగా ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జడ్జి లక్ష్మి మాట్లాడుతూ మతిస్థిమితం లేకుండా ఆయా ప్రాంతాల్లో సంచరించే వారిని గుర్తించి కోర్టుకు తీసుకొస్తే విశాఖపట్నం, హైదరాబాద్‌లో మానసిక వైద్యశాలలకు పంపించి వారికి తగిన వైద్యసేవలు అందిస్తామన్నారు. మానసిక వికలాంగులను ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న పిల్లలను పనులలో పెట్టడం కూడా నేరమని స్పష్టం చేశారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డాక్టర్ కె.అన్నపూర్ణ, న్యాయవాదులు పి.ప్రసన్నకుమార్, డి.శివప్రసాద్, చింతపల్లి జయప్రకాష్, గ్రామ పెద్దలు ఎస్.పాండురంగారావు, కాజా రమేష్, కృష్ణకుమార్, వైద్య సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

జ్ఞానసాయికి విశేషాభిషేకాలు

గుడ్లవల్లేరు: శ్రీజ్ఞానసాయిమందిరంలో స్వామివారిని గురువారం అధికసంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. మందిర నిర్వాహకులు యలమంచిలి నాగమోహన్, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారికి విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు.



పామర్రులో కనకదుర్గాదేవిగా కన్యకాపరమేశ్వరీదేవి



శ్రీశంకర మందిరంలో దుర్గాదేవిగా అమ్మవారు



తోట్లవల్లూరు శివాలయంలో శ్రీదుర్గాదేవిగా అమ్మవారు



తటివర్రు రోడ్డులో శ్రీకనక దుర్గాదేవిగా అమ్మవారు



లోకుమూడి దత్తాశ్రమంలో పూజలు చేస్తున్న భక్తులు



దుర్గాదేవిగా దర్శనమిచ్చిన శ్రీబాలాత్రిపుర సుందరీదేవి



మండవల్లిలో శ్రీదుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



దుర్గాదేవిగా దర్శనమిచ్చిన కొండలమ్మతల్లి

దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

పామర్రు: దేవి శరన్నవరాత్రులలో భాగంగా అమ్మవారు గురువారం దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. స్థానిక పర్వత వర్ధనీదేవిని కనకదుర్గాదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరీ ఆలయం , అంకమ్మతల్లి ఆలయం, సోమేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవిని కనకదుర్గాదేవిగా అలంకరించారు. కొండిపర్రులోని భ్రమరాంబదేవిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: స్థానిక శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ హరిదుర్గానాగేశ్వరరావు పర్యవేక్షించారు.

గుడివాడటౌన్‌లో..

గుడివాడటౌన్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు గురువారం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శ్రీశంకర మందిరంలో అమ్మవారిని శ్రీవిజయదుర్గాదేవిగా, శ్రీభీమేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీకనకదుర్గాదేవిగా, శ్రీగౌరీశంకరస్వామి దేవస్థానంలో శ్రీదుర్గాదేవిగా, నీలామహల్ రోడ్ శ్రీవిజయదుర్గ దేవస్థానంలో శ్రీకనకదుర్గాదేవిగా, శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రీదుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శ్రీభీమేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం చండీయాగం నిర్వహించారు.

తటివర్రు రోడ్డులో..

గుడివాడరూరల్: తటివర్రురోడ్డులో ఏర్పాటు చేసిన అమ్మవారు శ్రీకనకదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు బేతంశెట్టి వెంకట రవికుమార్, ప్రసాద్,ఈశ్వర్, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు. చినఎరుకపాడులోని శ్రీఅష్టలక్ష్మి అమ్మవారిని అర్చకులు శ్రీకనకదుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాశ్రమంలో..

పెదముత్తేవి(మొవ్వ): మొవ్వ మండలంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పెదముత్తేవి శ్రీకృష్ణాశ్రమంలో ముముక్షుజన మహాపీఠాధిపతి శ్రీముత్తేవి గౌరకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి వేడుకలకు గురువారం పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హాజరయ్యారు.జనసేన సమన్వయకర్త తాడిశెట్టి నరేష్, మండల పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వరరావు, ఆశ్రమవాసులు ముత్తేవి శ్రీవాసుదేవ కృష్ణచరణ్, తుర్లపాటి రాధాకృష్ణ, ఆనంద్ పాల్గొన్నారు. అదేవిధంగా కూచిపూడిలోని శ్రీబాలా త్రిపురసుందరీ అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మండవల్లి మండలంలో..

మండవల్లి: మండవల్లి శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అర్చకుడు భవానీశంకర్ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

గుడ్లవల్లేరు మండలంలో..

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీకొండలమ్మతల్లి గురువారం శ్రీకనకదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూజలు నిర్వహించారు. శ్రీకొండలమ్మ తల్లి అమ్మవారిని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దర్శించుకుని పూజలు చేశారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే నవరాత్రుల్లో పురస్కరించుకుని డోకిపర్రు భూసమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో అమ్మవారు శ్రీవరలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, కమిటీ సభ్యులు పెన్నేరు రమేష్, మోహనరావు, దేవేంద్ర పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే..

దుర్గాదేవి అమ్మవారు గుడివాడ నియోజకవర్గ ప్రజానీకాన్ని సుభిక్షం చేసేవిధంగా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. వెణుతురుమిల్లి, విన్నకోటలో దసరా నవరాత్రులను పురస్కరించుకుని నిర్వహిస్తున్న పూజలు, అన్నసమారాధనకు గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, కోటప్రోలు ఆదినారాయణ, పాలేటి ఆంజనేయులు, గణేష్, పేర్ని జగన్ పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: స్థానిక శ్యామలాంబ అమ్మవారు గురువారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు చండీహోమం నిర్వహించారు. ఈవో వీఎస్‌కే శేఖర్, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం, కన్యకాపరమేశ్వరి ఆలయం, లోకుమూడిగరువు దత్తాశ్రమం, ఆటపాక, గోనెపాడు గ్రామాల్లో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

తోట్లవల్లూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల వరద సమయంలో లంక ప్రజలను పడవల్లో తరలించిన 18 మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున నగదును, బోట్ సేఫ్టీ పరికరాలను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. తహసీల్దార్ కుసుమకుమారి, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, టీడీపీ నాయకులు వీరపనేని శివరామ్, లుక్కా రేణుకారావు, మూడే శివశంకర్, పాముల శ్రీనివాసరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో బోట్ సేఫ్టీ పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

స్టేషన్ ఎదుట మౌనదీక్ష

కలిదిండి(కైకలూరు): తమకు రక్షణ కల్పించాలని కోరుతూ పలువురు యువకులు గురువారం పోలీస్ స్టేషన్ ఎదుట మౌనదీక్ష చేశారు. ఈనెల 8వతేదీన కోట కలిదిండి దసరా ఉత్సవ మండపం వద్ద గొల్లగూడేనికి చెందిన యువకులతో పలువురు గొడవపడ్డారు. దీనిపై యువకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఫిర్యాదు చేసిన తర్వాత కొందరు వ్యక్తులు తమ ఇళ్లవద్ద ముసుగు వేసుకొని సంచరిస్తున్నారని, దీంతో ప్రాణభయంగా ఉందని పి.ప్రేమ్‌సాగర్, వి.మణికుమార్, తేజసాయి, భరత్‌కుమార్, ఓంకార్ ఈశ్వర్, లోకేష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

త్వరలో ఆఫీసు భవనం ప్రారంభం

గుడ్లవల్లేరు: కౌతవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రూ.30లక్షలతో మరమ్మతులు చేయించినట్లు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. ఆయన గురువారం కార్యాలయ భవనాన్ని పరిశీలించారు.

అధికారులతో సమీక్ష సమావేశం

పామర్రు: అధికారులు నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సూచించారు. స్థానిక ఆర్ అండ్‌బి గెస్టుహౌస్‌లో గురువారం ఆయన నియోజకవర్గంలోని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జనసేన నియోకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, అధికారులు జ్యోతి, సురేష్, రామారావు, మండల పార్టీ అధ్యక్షులు కె.ప్రవీణ్‌చంద్ర, జిల్లా రైతు సంఘ ఉపాధ్యక్షులు వల్లూరిపల్లి గణేష్ పాల్గొన్నారు

గృహ నిర్మాణాల పరిశీలన

గుడ్లవల్లేరు: గృహ నిర్మాణాలను ఆయా లబ్ధిదారులు వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ రత్నశ్రీ సూచించారు. గుడ్లవల్లేరు జగనన్న కాలనీలో గురువారం ఆమె పర్యటించారు. మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకోవాలని కోరారు. డీఈ రామోజీ నాయక్, ఏఈ సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు..



మేళతాళాలతో అమ్మవారి ఊరేగింపు



కేరళ వాయిద్యాలతో కళాకారుల ప్రదర్శన



అలరించిన శక్తి వేషధారణలు

అంబరాన్నంటిన సంబరాలు

శ్రీకొండలమ్మ అమ్మవారి సన్నిధిలో దుర్గాష్టమి సంబరాలు అంబరాన్నంటాయి. ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అమ్మవారి ఊరేగింపులో కనకడప్పుల వాయిద్యా లు, తీన్‌మార్‌డ్యాన్స్‌లు, కళాకారుల విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు, మహిళల కోలాటం , కేరళ వాయిద్యాలతో కళాకారుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి. –గుడ్లవల్లేరు